క్లుప్తంగా

ఉచిత మాక్ టెస్ట్‌ను సద్వినియోగం చేసుకోండి

కొత్తగూడెంఅర్బన్: తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించే గ్రూప్–2 పరీక్షకు దరఖాస్తు చేసుకున్న మైనారిటీ అభ్యర్థులకు తెలంగాణ రాష్ట్ర మైనారిటీ స్టడీ సర్కిల్ వారు నిర్వహిస్తున్న ఉచిత మాక్ టెస్ట్‌లను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా మైనారిటీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎండీ యాకూబ్‌పాషా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆగస్టు 1, 2వ తేదీల్లో మాక్ టెస్ట్‌లు నిర్వహిస్తారని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈనెల 30వ తేదీ లోగా జిల్లాలోని మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి కార్యాలయంలో ఆన్‌లైన్ లింకు పొందాలని సూచించారు.

గోరింటాకు సంబరాలు

కొత్తగూడెంరూరల్: లక్ష్మీదేవిపల్లి మండలం అశోక్‌నగర్ కాలనీలోని అంగన్‌వాడీలో ఆషాఢ మాసం సందర్భంగా గోరింటాకు సంబరాలు నిర్వహించారు. ఎంపీటీసీ కొల్లు పద్మ మాట్లాడుతూ... చిన్నారులకు గోరింటాకు విశిష్టత తెలుపుతూ ఎండాకాలం వెళ్లి వర్షాకాలం వచ్చిన తొలకరి జల్లులతో ఒంట్లో ఉన్న వేడి పోయి చల్లదనం వస్తుందన్నారు. చేతికి, కాళ్లకు గోరింటాకు పెట్టుకుంటే అందంతోపాటు ఆరోగ్యం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ పుష్ప, అంజలి, ఆయాలు మణి, పద్మ, మల్లమ్మ తదితరులు ఉన్నారు.

మంత్రిని కలిసిన సెకండ్ ఏఎన్‌ఎంలు

జూలూరుపాడు: రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహాను హైదరాబాద్‌లో గురువారం తెలంగాణ సెకండ్ ఏఎన్‌ఎం యూనియన్ అసోసియేషన్ నాయకులు కలిశారు. ఈ మేరకు సెకండ్ ఏఎన్‌ఎం యూనియన్ అసోసియేషన్ జిల్లా నాయకులు పార్వతి, అరుణ, ప్రియాంకలు విలేకరులకు తెలిపారు. సెకండ్ ఏఎన్‌ఎంలను పర్మనెంట్ చేయాలని, చాలీచాలని జీతాలతో ఇబ్బంది పడుతున్నామని, తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని మంత్రిని కోరినట్లు చెప్పారు. మంత్రి సానుకూలంగా స్పందించారని, సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో మధురిమ, సత్యావతి, ప్రవీణ, జ్యోతి, శ్రీదేవి తదితరులు ఉన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే చర్యలు

సుజాతనగర్: బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై జుబేదాబేగం హెచ్చరించారు. గురువారం మండల కేంద్రంలోని బెల్ట్ షాపుల్లో దాడులు నిర్వహించారు. మాట్లాడుతూ.. బహిరంగ ప్రదేశాలో మద్యం తాగడం వలన మహిళలు, విద్యార్థులు ఇబ్బంది పడే అవకాశం ఉందన్నారు. దీనివలన శాంతిభద్రతలకు విఘాతం కలుగుతుందన్నారు. ఆయా ప్రదేశాలపై నిఘా ఉంచామని తెలిపారు.

వెండి వస్తువులు బహూకరణ



ఆలయ కమిటీ చైర్మన్ నరసింహారావుకు వెండి వస్తువులు అందజేస్తున్న దాతలు

జూలూరుపాడు: కాకర్ల శ్రీ సంతాన వేణుగోపాల స్వామి వారికి గురువారం దాతలు వెండి వస్తువులను బహూకరించారు. కొత్తగూడెం పట్టణానికి చెందిన తురగ వేణుకుమార్, నవ్యశ్రీ దంపతులు, మారుతీదేవి పద్మ, రాజేశ్వరరావు దంపతులు స్వామి వారికి రూ1.10 లక్షల విలువైన కిలో వెండి దశావతారాల శఠగోపం, ప్లేట్, నామాలు ఆలయ చైర్మన్ అల్లాడి నరసింహారావు, పూజారికి అందజేశారు. విరాళంగా రూ.40 వేలు నగదును ఇచ్చారు.

ఎన్‌ఎండీసీ కర్మాగారాన్ని పునరుద్ధరించాలి

పాల్వంచ: పాల్వంచలోని ఎన్‌ఎండీసీ కర్మాగారాన్ని పునరుద్ధరించాలని ఐఎన్‌టీయూసీ నాయకులు కోరారు. ఈ మేరకు రాజ్యసభ సభ్యురాలు రేణుకా చౌదరి, పార్లమెంట్ సభ్యుడు రామసహాయం రఘురామిరెడ్డిలను గురువారం ఖమ్మంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. మాట్లాడుతూ... కర్మాగారంలోని మౌలిక వసతులను సద్వినియోగం చేసుకుని స్థానికులకు ఉద్యోగావకాశాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో బాలు నాయక్, షేక్ అబ్దుల్ జలీల్, వాంకుడోతు రవినాయక్, శనగ రామచందర్‌రావు పాల్గొన్నారు.

నేడు వన మహోత్సవం

ఇల్లెందు: ఇల్లెందు మున్సిపాలిటీలో శుక్రవారం వన మహోత్సవం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కమిషనర్ యాదగిరి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. పట్టణంలోని చెరువు కట్ట లేక్ వ్యూ పార్క్ వద్ద మొక్కలు నాటనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కోరం కనకయ్య, చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, కమిషనర్ యాదగిరి, కౌన్సిలర్లు హాజరవుతారని స్థానికులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

రైతు శ్రేయస్సే ప్రభుత్వ ధ్యేయం

- ఘనంగా రుణమాఫీ సంబురాలు
- పాల్గొన్న రైతులు, అధికారులు
- సీఎం, డిప్యూటీ సీఎం చిత్రపటాలకు క్షీరాభిషేకం



టేకులపల్లి: కోయగూడెంలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే కనకయ్య, రైతులు

చుంచుపల్లి: ప్రశాంతినగర్ రైతు వేదికలో గురువారం రైతు రుణమాఫీ సందర్భంగా ఏర్పాటు చేసిన రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమానికి జిల్లా పరిషత్ చైర్మన్ కె.చంద్రశేఖర్‌రావు హాజరయ్యారు. మాట్లాడుతూ... గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం 2019 ఎన్నికల వాగ్దానాల్లో భాగంగా రైతులకు రూ.లక్ష వరకు రుణమాఫీ చేస్తామని ప్రకటించి మోసం చేసిందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో రైతు రుణమాఫీని ప్రకటించి వెంటనే అమల్లోకి తెచ్చి రైతులకు అండగా నిలిచిందన్నారు. రాష్ట్రంలో నేడు రుణమాఫీతో రైతులందరూ పండగ చేసుకుంటున్నారని, రాష్ట్ర చరిత్రలో ఇది నిలిచిపోతుందన్నారు. మండల పరిషత్ అధ్యక్షురాలు బాదావత్ శాంతి, వ్యవసాయ శాఖ టెక్నికల్ ఏడీ రవికుమార్, అగ్రికల్చర్ ఏటీబీ రాజేశ్వరి, ఏఈఓ ఎం.మమత, మండల పంచాయతీ అధికారి గుంటి సత్యనారాయణ, రైతులు పాల్గొన్నారు.

జూలూరుపాడు: రాష్ట్ర ప్రభుత్వం ఏకకాలంలో రైతు రుణమాఫీ చేయడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ కాంగ్రెస్ పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో గురువారం జూలూరుపాడులో రైతు సంబరాలు ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, రైతులు కలిసి జూలూరుపాడులో భారీ ప్రదర్శన నిర్వహించారు. బాణసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. పార్టీ జిల్లా నాయకుడు లేళ్ల వెంకటరెడ్డి మాట్లాడుతూ... రైతు రుణమాఫీ చేసి సీఎం రేవంత్‌రెడ్డి మాట నిలబెట్టుకున్నారన్నారు. పాపకొల్లులో సీఎం రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాలోత్ మంగీలాల్ నాయక్, దుద్దుకూరి మధుసూదన్‌రావు, యల్లంకి పుల్లయ్య పాల్గొన్నారు. కాకర్ల రైతు వేదికలో వ్యవసాయశాఖ అధికారుల ఆధ్వర్యంలో రైతు సంబురాలు ఘనంగా నిర్వహించారు. తమ బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమయ్యాయని, రైతులు సంతోషం వ్యక్తం చేశారు. స్థానిక రైతు వేదికలో వ్యవసాయ అధికారులు ఎల్‌ఈడీ ఏర్పాటు చేయడంతో హైదరాబాద్ సెక్రటేరియట్ నుంచి సీఎం వీడియా కాన్ఫరెన్స్ ద్వారా రైతులతో ముచ్చటించారు. జూలూరుపాడు సొసైటీ చైర్మన్ చీమలపాటి భిక్షం, ఏఓ ఎస్.రఘుదీపిక, ఎస్‌బీఐ ఫీల్డ్ ఆఫీసర్ ఎన్.ప్రసాద్, రైతులు పాల్గొన్నారు.

ఇల్లెందురూరల్: రాష్ట్ర ప్రభుత్వం రైతులకు రుణమాఫీ పథకం అమలు చేయడంపై కాంగ్రెస్ శ్రేణులు గురువారం సంబురాలు నిర్వహించుకున్నాయి. సుదిమళ్ల రైతు వేదిక నుంచి సుభాష్‌నగర్ కూడలి వరకు రైతులతో కలిసి భారీ ప్రదర్శన నిర్వహించారు. దారిపొడవునా బాణసంచా కాలుస్తూ ప్రభుత్వ పెద్దలు, కాంగ్రెస్ నాయకులకు జేజేలు పలికారు. సోనియాగాంధీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కోరం కనకయ్య, మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, ఎంపీపీ చీమల నాగరత్నమ్మ, వైస్‌ఎంపీపీ మండల రాము తదితరులు పాల్గొన్నారు.

పాల్వంచరూరల్: రాష్ట్ర ప్రభుత్వం రైతులకు రుణమాఫీ చేయడంతో గురువారం జగన్నాథపురం రైతువేదికలో సంబురాలు జరుపుకున్నారు. రెండు వందల మంది రైతులు సీఎం వీడియో కాన్ఫరెన్స్ వీక్షించారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, ఏఓ శంకర్, బి.వాసుదేవరావు, యర్రంశెట్టి ముత్తయ్య పాల్గొన్నారు.

సుజాతనగర్: ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రైతులకు రుణమాఫీని అందించి ప్రభుత్వం రైతుల కుటుంబాల్లో ఆనందం నింపిందని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. సుజాతనగర్‌లోని రైతు వేదికలో సీఎం, మంత్రులతో జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో రైతులతో కలిసి ఎమ్మెల్యే పాల్గొన్నారు. రైతులు ఎమ్మెల్యేకు స్వీట్లు తినిపించారు. ఈ కార్యక్రమంలో భూక్యా పద్మావతి, మండే హనుమంతరావు, ఏఓ జి.నర్మద, భూక్యా దస్రు పాల్గొన్నారు.

టేకులపల్లి: రైతులకు రెండు లక్షల రుణమాఫీ దేశంలోనే చారిత్రాత్మకమని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. గురువారం కోయగూడెం క్లస్టర్ పరిధిలోని ముత్యాలంపాడు క్రాస్‌రోడ్ రైతు వేదికలో ఏర్పాటు చేసిన రుణమాఫీ సంబురాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. టపాసులు పేలుస్తూ, ఆటపాటలతో గ్రామంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బానోతు ప్రియాంక, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బాబూరావు, ఏడీఏ వాసవీరాణి, ఏఓ అన్నపూర్ణ, సొసైటీ చైర్మన్ లక్కినేని సురేందర్, సరోజిని, పూర్ణ, ఉండేటి ప్రసాద్, ఏఈఓలు శ్రావణి, రమేష్, ప్రవీణ్, భార్గవి, విశాల, రెహానా పాల్గొన్నారు.



చుంచుపల్లి: సీఎం వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన అధికారులు



పాల్వంచరూరల్: రాహుల్‌గాంధీ, సీఎం రేవంత్ రెడ్డి ఫ్లెక్సీలకు క్షీరాభిషేకం చేస్తున్న రైతులు



జూలూరుపాడులో ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు, రైతులు



సుజాతనగర్: కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుకు స్వీట్ తినిపిస్తున్న రైతు



ఇల్లెందురూరల్: సోనియాగాంధీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు, రైతులు

రోటరీ క్లబ్ సేవలు ప్రశంసనీయం

కొత్తగూడెంఅర్బన్: రోటరీ క్లబ్ ఆఫ్ కొత్తగూడెం సమాజానికి అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని, వారి సేవలు నిరంతరం కొనసాగాలని జెడ్పీ చైర్మన్ కంచర్ల చంద్రశేఖరరావు అన్నారు. గురువారం కొత్తగూడెంలో జరిగిన రోటరీ క్లబ్ కొత్తగూడెం 2024–25 సంవత్సరానికి నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అనంతరం క్లబ్ నూతన అధ్యక్షులుగా పి.సుజాత, కార్యదర్శిగా పి.దుర్గారాణి, కోశాధికారిగా డాక్టర్ కే.సావిత్రి, ఇతర సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు. పూర్వ గవర్నర్ జె.అబ్రహం, రోటరీ అసిస్టెంట్ గవర్నర్ పి.భూషణ్‌రావు పాల్గొన్నారు.

'రాజకీయాల నుంచి తప్పుకునేది లేదు..'

సూపర్‌బజార్(కొత్తగూడెం): ఎన్ని అవాంతరాలు ఎదురైనా తమ కుటుంబం రాజకీయాల నుండి దూరం కాదని మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు కుమారుడు రాఘవేంద్రరావు వెల్లడించారు. కొత్తగూడెంలోని బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలతో గురువారం ఆయన సమావేశమయ్యారు. నలభై ఏళ్లుగా తమను నమ్ముకున్న అభిమానులు, నాయకుల కోసం పనిచేస్తామని తెలిపారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కష్టపడి పనిచేద్దామని పిలుపునిచ్చారు. మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి, ఎంపీపీలు శాంతి, భూక్యా సోనీ, బత్తుల వీరయ్య పాల్గొన్నారు.

అంగన్‌వాడీ భవనం నిర్మించండి..

జూలూరుపాడు: గుండెపుడి అంగన్‌వాడీ కేంద్రానికి నూతన భవనం నిర్మించాలని సీపీఎం నాయకుడు వల్లమల చందర్‌రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శిథిలావస్థలో భవనాన్ని గురువారం సీపీఎం నాయకులు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ... 35 ఏళ్ల క్రితం నిర్మించిన భవనంలో అంగన్‌వాడీ కేంద్రాన్ని నడుపుతున్నారని, ఈ భవనం పూర్తిగా దెబ్బతినడంతో వర్షాలకు పిల్లలు ఇబ్బంది పడుతున్నట్లు చెప్పారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి ఎలాంటి ప్రమాదం జరగక ముందే నూతన భవనానికి నిధులు మంజూరు చేయాలని కోరారు.

ఉద్యోగావకాశాలు కల్పించండి..

జూలూరుపాడు: నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించాలని భారతీయ గోర్ బంజారా పోరాట సమితి ఉమ్మడి ఖమ్మం జిల్లా అధ్యక్షుడు బానోత్ దుర్గాప్రసాద్ అన్నారు. గురువారం ఆయన జూలూరుపాడులో మాట్లాడుతూ... నిరుద్యోగులకు మిషన్ భగీరథలో ఔట్ సోర్సింగ్ విధానంలో పంపు ఆపరేటర్ల ఉద్యోగాలు ఇవ్వాలన్నారు. ఈ మేరకు ఎల్‌అండ్‌టీ సంస్థ చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో భావ్‌సింగ్, నాగరాజు, రాంబాబు, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

ఐక్యంగా ఉండాలి

సూపర్‌బజార్(కొత్తగూడెం): ఐక్యంగా ఉంటేనే సమస్యలకు పరిష్కారం ఉంటుందని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్‌పాషా అన్నారు. గురువారం శేషగిరిభవన్‌లో ఏఐటీయూసీ అనుబంధ చికెన్ షాప్స్ ఓనర్స్ అండ్ వర్కర్స్ అసోసియేషన్ మహాసభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు.

ముందస్తు జాగ్రత్తలు తీసుకోండి

సూపర్‌బజార్(కొత్తగూడెం): విస్తారంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేయాలని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు కలెక్టర్ జితేష్ వి.పాటిల్‌ను గురువారం రాత్రి ఫోన్‌లో కోరారు. ప్రధానంగా గోదావరి పరివాహక ప్రాంతాలు ముంపునకు గురయ్యే ప్రమాదం ఉన్నందున పరిసర గ్రామాల ప్రజలను అప్రమత్తం చేయాలని, అవసరమైతే వరద బాధితులను పునరావాసాలకు తరలించాలని చెప్పారు. విషజ్వరాలు ప్రబలే అవకాశం ఉన్నందున గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని, పారిశుద్ధ్య నిర్వహణ చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. రహదారులు ధ్వంసమైన గ్రామాలలో ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని, ముంపునకు గురైన గ్రామాలలో యుద్ధ ప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టాలని కోరారు. శిథిలావస్థకు చేరిన ఇళ్లు, గుడిసెలలో నివాసం ఉండే పేదలు జాగ్రత్త వహించేలా అవగాహన కల్పించాలన్నారు. కమ్యూనిస్టు శ్రేణులు సహాయక చర్యల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

ఉచిత వైద్యపరీక్షలు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి రిటైర్డ్ ఉద్యోగులకు ఈనెల 23, 24వ తేదీల్లో హైదరాబాద్‌లోని ఆమోర్ ఆస్పత్రిలో ఉచిత వైద్యపరీక్షలు నిర్వహించనున్నట్లు రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. వివరాలకు 90108 27279 నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

డీఏ విడుదల చేయాలి


కొత్తగూడెంఅర్బన్: ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న డీఏలను విడుదల చేస్తామని ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చింది కానీ, ఇప్పటి వరకు నెరవేర్చలేదని తెలంగాణ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు భూక్యా మోహన్ రాథోడ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

వెంటనే ప్రకటించాలని లేదంటే దశలవారీగా ప్రభుత్వంపై ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తామన్నారు.

సోదరుల మధ్య ఘర్షణ

ఇల్లెందు: పట్టణంలోని రైటర్ బస్తీకి చెందిన జి.పవన్‌ను, అతని సోదరుడు దాసు దాడి చేసి గాయపర్చాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఏఎస్‌ఐ అబ్దుల్ ఘని విచారణ చేసి కేసు నమోదు చేశారు. భూమి పంపకం విషయంలో ఘర్షణ జరిగినట్లు పోలీసులు తెలిపారు.

'రాయల'కు నివాళులర్పించిన నాయకులు



నివాళులర్పిస్తున్న మాస్‌లైన్ నాయకులు

ఇల్లెందు/టేకులపల్లి: జీవితమంతా ప్రజల తరఫున పోరాటాలకు ధారపోసిన రాయల చంద్రశేఖర్ మృతి బాధాకరమని మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య అన్నారు. రైలు ప్రమాదంలో రాయల మృతి చెందగా ఇల్లెందులో గురువారం నిర్వహించిన సంతాప సభలో గుమ్మడి నర్సయ్య నివాళులర్పించి మాట్లాడారు. అలాగే, ఎన్డీ నాయకులు ఆవునూరి మధు, సాధినేని వెంకటేశ్వరరావు, చంద్రన్న, అశోక్, జె.సీతారామయ్య, తుపాకుల నాగేశ్వరరావు కూడా నివాళులర్పించారు. అంతేకాక మాస్‌లైన్ ఆధ్వర్యాన ఇల్లెందులో ర్యాలీ నిర్వహించి నివాళులర్పించగా నాయకులు ఈసం శంకర్, పూనెం కుమార్, యాకుబ్‌షావలీ, జాటోతు కృష్ణ, బుర్ర వెంకన్న, ఎంపీటీసీ బిచ్చా, శ్రీరామ్ కోటయ్య, అజయ్, బొర్రా వెంకన్న, పృథ్వీ పాల్గొన్నారు. అలాగే, రాయల చంద్రశేఖర్ మృతి పార్టీకి తీరని లోటని పీవైఎల్ రాష్ట్ర సహాయ కార్యదర్శి నోముల భానుచందర్, మండల కార్యదర్శి తోటకూరి సతీష్ టేకులపల్లిలో విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.

విద్యాసంస్థల్లో సౌకర్యాలు కల్పిస్తాం..



తాగునీటి పథకానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే సాంబశివరావు

కొత్తగూడెంఅర్బన్/సూపర్‌బజార్(కొత్తగూడెం): ప్రభుత్వ విద్యాసంస్థల్లో సమస్యలు పరిష్కరిస్తూ మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నానని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తెలిపారు. కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్ నుంచి ప్రభుత్వ జూనియర్ కళాశాల వరకు వంద మీటర్ల రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయగా, కళాశాలలో తాగునీటి సమస్య పరిష్కారం కోసం బోరు, పైపులైన్ మంజూరయ్యాయి. ఈ క్రమంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన తాగునీటి పథకానికి శంకుస్థాపన చేయడంతో పాటు మొక్కలు నాటారు. మాట్లాడుతూ... ఏళ్లుగా విద్యార్థులు తాగునీటి సమస్యతో ఇబ్బంది పడుతుండగా ప్రిన్సిపాల్ వినతి మేరకు బోరు, మోటారు, పైపులైన్ మంజూరు చేసినట్లు తెలిపారు. మున్సిపల్ కమిషనర్ శేషాంజన్‌స్వామి, కౌన్సిలర్ లక్ష్మణ్, ప్రిన్సిపాల్ రమేష్, అధ్యాపకులు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు. అలాగే, కొత్తగూడెం మున్సిపాలిటీ, చుంచుపల్లి, లక్ష్మీదేవిపల్లి, సుజాతనగర్ మండలాలకు సంబంధించిన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులు 160మందికి కొత్తగూడెం క్లబ్‌లో గురువారం సాయంత్రం ఎమ్మెల్యే చెక్కులను అందజేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి, ఎంపీపీలు పద్మావతి, బాదావత్ శాంతి, భూక్యా సోనీ, తహసీల్దార్లు కృష్ణ, దొడ్డ పుల్లయ్యతో పాటు మండే వీరహన్మంతరావు, ధర్మరాజు తదితరులు పాల్గొన్నారు.

సీపీఐలో పలువురి చేరిక..

పాల్వంచ: నియోజకవర్గంలో మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించినట్లు ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తెలిపారు. పాల్వంచలోని చంద్ర రాజేశ్వరరావు భవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వివిధ గ్రామాలకు చెందిన పలువురు సీపీఐలో చేరగా వారికి ఎమ్మెల్యే కండువాలు కప్పారు. అనంతరం మాట్లాడారు. ముత్యాల విశ్వనాథం, అడుసుమల్లి సాయిబాబు, వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, బండి నాగేశ్వరరావు, డి.సుధాకర్, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

బంజారాలకు మంత్రి పదవి ఇవ్వండి



మాట్లాడుతున్న రాంబాబు నాయక్

టేకులపల్లి: త్వరలో జరగనున్న రాష్ట్ర మంత్రివర్గ విస్తరణలో బంజారాలకు మంత్రి పదవి ఇవ్వాలని సేవాలాల్ సేన రాష్ట్ర అధ్యక్షుడు ఆంగోతు రాంబాబు నాయక్ అన్నారు. ఈ మేరకు గురువారం మండల కేంద్రంలోని సేవాలాల్ ఆలయంలో కొత్తగూడెం జిల్లా సేవాలాల్ సేన జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. మాట్లాడుతూ.. హక్కుల సాధన కోసం బంజారాలు వెనకాడొద్దని, ఎవరికీ భయపడొద్దని ఉద్యమిస్తూ ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. సేవాలాల్ సేన, అనుబంధ సంఘాలను అన్ని మండలాల్లో బలోపేతం చేయాలని సూచించారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆగస్టు 9న హైదరాబాద్‌లోని బాబూ జగ్జీవన్‌రామ్ భవన్‌లో జరిగే సేవాలాల్ సేన రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో ధరావత్ ప్రేమ్‌చంద్ నాయక్, రేఖానాయక్, రవి రాథోడ్, ధరావత్ సురేష్ నాయక్, గుగులోత్ బద్రు నాయక్, లావుడ్యా వెంకటేష్, బానోత్ గణేష్, బోడ రమేష్ పాల్గొన్నారు.

'అధికారుల నిర్లక్ష్యంతోనే ప్రమాదాలు'

సింగరేణి(కొత్తగూడెం): ఫ్రంట్‌లైన్ అధికారుల (సూపర్‌వైజర్ల) నిర్లక్ష్యం కారణంగానే సింగరేణిలో వరుస ప్రమాదాలు జరుగుతున్నాయని, బుధవారం ఆర్జీ–3 ఏరియాలో జరిగిన ప్రమాదంలో ఇద్దరు మృతి చెందడానికి అధికారుల పట్టించుకోకపోవడమే కారణమని హెచ్‌ఎంఎస్ ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్ గురువారం ఒక ప్రకటనలో ఆరోపించారు. ఈ సంవత్సరం ఇప్పటికే నాలుగు ప్రమాదాలు జరిగాయని పేర్కొన్నారు. వర్షాలు వస్తున్నప్పుడు ఓసీల్లో పని చేయించొద్దనే నిబంధన ఉన్నా అధికారులు పట్టించుకోకపోవడంపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. కాగా, శుక్రవారం హైదరాబాద్‌లో జరిగే కమిటీ సమావేశంలో గనుల్లో భద్రత అంశంపై చర్చించాలని కోరారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

కొత్తగూడెంరూరల్: వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల నివారణకు వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, సిబ్బందిని అప్రమత్తం చేయాలని రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్ కొత్వాల శ్రీనివాసరావు... జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి భాస్కర్ నాయక్‌ను కోరారు. ఈ మేరకు గురువారం వినతిపత్రం ఇచ్చారు. మాట్లాడుతూ... పాల్వంచ మండలంలోని మారుమూల ఏజెన్సీ ప్రాంతమైన ఉల్వనూరు బంజర పంచాయతీ చిరుతానిపాడు గ్రామంలో వింత అంటువ్యాధి సోకి ఏజెన్సీ ప్రాంతం భయకంపితులవుతున్నట్లు చెప్పారు. అన్ని గ్రామాల్లో ఫీవర్ సర్వే చేయాలన్నారు. యర్రంశెట్టి ముత్తయ్య, కొండం వెంకన్న, వెంకటేశ్వర్లు, పైడిపల్లి మహేష్, ఉండేటి శాంతివర్ధన్, శిరసాని రమణ, ప్రసాద్ ఉన్నారు.

పోలీసుల తనిఖీ




మాట్లాడుతున్న డీఎస్పీ చంద్రభాను

ఇల్లెందు: గురువారం తెల్లారుజామున డీఎస్పీ ఎన్.చంద్రభాను, సీఐ బత్తుల సత్యనారాయణ ఆధ్వర్యంలో 60 మంది పోలీసులు ఆజాద్‌నగర్‌లో నాకాబందీ నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి వాహనాలు, పత్రాలు, లైసెన్స్, బీమా పత్రాలను పరిశీలించారు. సుమారు 50 వాహనాలను తనిఖీ చేసి పత్రాలు లేని వాహనాలను సీజ్ చేశారు. డీఎస్పీ మాట్లాడుతూ... కాలనీలోకి వచ్చే కొత్త వ్యక్తుల సమాచారం అందించాలని కోరారు. మత్తు, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, ఎవరైనా సరఫరా చేస్తున్నట్లు తెలిస్తే సమాచారం ఇవ్వాలన్నారు. కొత్తచట్టాలు అమలులోకి వచ్చాయని, పత్రాలు లేని వాహనాలు నడపరాదని, అట్టి వాహనాలు ప్రమాదాలకు గురైతే వారిపై శిక్షలు కఠినంగా ఉంటాయని తెలిపారు. నంబర్ ప్లేట్లు లేని వాహనాలు సీజ్ చేస్తామని చెప్పారు.

చంద్రశేఖర్ మృతి పార్టీకి తీరని లోటు

సింగరేణి(కొత్తగూడెం): సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ కేంద్ర కమిటీ సభ్యుడు కామ్రేడ్ రాయల చంద్రశేఖర్ మరణం పార్టీకి తీరని లోటని, ఆ పార్టీ నేతలు షావెల్, విమలక్క, ఆవునూరి మధు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 1975లో ఉద్యమంలో చేరి, అనేక ఆటు పోట్లు ఎదుర్కొని, ప్రజా సమస్యల కోసం పోరాటాలు సాగించారని తెలిపారు. ఇల్లెందు, సత్తుపల్లి, అశ్వారావుపేటలో జరిగిన అనేక పోరాటాల్లో పాల్గొని సమస్యలను పరిష్కరించటంలో కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. ఆయన మరణం ఉద్యమానికి తీరని లోటన్నారు. కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

మాదకద్రవ్యాల నివారణపై అవగాహన



చుంచుపల్లి: విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై ప్రవీణ్‌కుమార్

చుంచుపల్లి: మాదకద్రవ్యాల అలవాటుతో భవిష్యత్ నాశనమవుతుందని, మాదకద్రవ్యాల నివారణకు సమష్టిగా కృషి చేయాలని చుంచుపల్లి ఎస్‌ఐ గద్దం ప్రవీణ్‌కుమార్ అన్నారు. జిల్లా ఎస్పీ రోహిత్‌రాజ్, కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్, చుంచుపల్లి సీఐ రాయల వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు గురువారం విద్యానగర్‌లోని శ్రీ చైతన్య హైస్కూల్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. మాదకద్రవ్యాల వినియోగంతో పిల్లల భవిష్యత్ అంధకారంగా మారుతుందని, వాటికి దూరంగా ఉండాలని, మాదకద్రవ్యాల వినియోగం వల్ల యువత భవిష్యత్ నాశనమవుతుందని, తల్లిదండ్రులు తమ పిల్లలను గొప్పవాళ్లను చేయాలనే ఆశతో ఉంటే కొంతమంది యువత డ్రగ్స్‌కు అలవాటు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మత్తు పదార్థాల వల్ల జరిగే అనర్థాలను విద్యార్థులు తమ తల్లితండ్రులకు వివరించాలని, మత్తు పదార్థాలకు సంబంధించిన సమాచారం తెలిస్తే సమీపంలోని పోలీసులకు చెప్పాలన్నారు.

కొత్తగూడెంఅర్బన్: మాదకద్రవ్యాల వినియోగంతో భవిష్యత్ అంధకారంగా మారుతుందని కొత్తగూడెం డీఎస్పీ షేక్ అబ్దుల్ రెహమాన్ తెలిపారు. గురువారం స్థానిక ప్రియదర్శినీ కళాశాలలో డ్రగ్స్ అవేర్నెస్ కార్యక్రమం నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ... మాదకద్రవ్యాలకు అలవాటుపడితే జీవితంలో ఏ పని చేయలేమన్నారు. విద్యార్థులు వాటికి దూరంగా ఉండాలని సూచించారు. అనంతరం విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో వన్‌టౌన్ ఎస్‌హెచ్‌ఓ కరుణాకర్, ఎస్సై విజయలక్ష్మి, హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామచంద్ర పాఠశాలలో..

కొత్తగూడెం పట్టణ పరిధి శ్రీరామచంద్ర పాఠశాలలో త్రీటౌన్ ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల నివారణపై అవగాహన కార్యక్రమం జరిగింది. తొలుత విద్యార్థులతో కలిసి పట్టణంలో ప్రదర్శన నిర్వహించారు. సీఐ శివప్రసాద్ మాట్లాడుతూ.. డ్రగ్స్ వినియోగంతో పిల్లల భవిష్యత్ అంధకారంగా మారుతుందని, వాటికి దూరంగా ఉండాలన్నారు. మత్తు పదార్థాలకు సంబంధించిన సమాచారం తెలిస్తే సమీపంలోని పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని సూచించారు.

సింగరేణి(కొత్తగూడెం): పిడికిలి బిగిద్దాం, డ్రగ్స్‌ను పారదోలుదాం, కలిసికట్టుగా శ్రమిద్దాం, డ్రగ్స్ రహిత సమాజం నిర్మిద్దామని, గంజాయి వద్దు, తులసి ఆకే ముద్దని, గంజాయి తాగం, ఇతరులను తాగనివ్వం, చేయిచేయి కలుపుదాం, చెడును నిర్మూలిద్దామని కొత్తగూడెం టూ టౌన్ సీఐ రమేష్‌కుమార్ యువతకు స్లోగన్స్ చేశారు. జిల్లా ఎస్పీ రోహిత్‌రాజ్ ఆదేశాల మేరకు గురువారం కొత్తగూడెంలోని టూ టౌన్ పరిధిలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన కల్పించారు. మాట్లాడుతూ.. మాదకద్రవ్యాల నిర్మూలన అందరి బాధ్యతని, ఇందుకు సమాజం కలిసి రావాలన్నారు. తల్లితండ్రులు, అధ్యాపకులు చెప్పిన సూచనలు పాటిస్తూ ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.

జూలూరుపాడు: యాంటీ నార్కోటిక్స్ దినోత్సవం సందర్భంగా మాదక ద్రవ్యాల నివారణపై విద్యార్థులు, అధ్యాపకులకు గురువారం పోలీసులు అవగాహన కల్పించారు. సాధన జూనియర్ కళాశాల, వెంగన్నపాలెం సెయింట్ ఆంటోనియస్ స్కూల్‌లో జూలూరుపాడు ఎస్‌ఐ రాణాప్రతాప్ మాట్లాడుతూ... విద్యార్థులు గంజాయి, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు.